TELUGU & ENGLISH డిజిటల్ మీడియా | FAST NEWS | VIDEO NEWS | e-PAPER | DIGITAL SERVICES | 24/7

టీ-మీడియా

సామాజికం ... ప్రజల పక్షం ... 24/7 ప్రజా సేవలో...

వార్తలు | వీడియోలు | ఫోటోలు | ఇంటర్వ్యూలు | ప్రజా సమస్యలు | ప్రత్యేక కథనాలు | విశ్లేషణలు

epaper,www.tmedia.net.in | YouTube | facebook

GSTIN:36FDKPS1308P1ZX

టీ-మీడియా

సామాజికం ... ప్రజల పక్షం...

epaper,www.tmedia.net.in | YouTube | facebook

శుక్రవారం 23/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

సీఎం చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ

రెబల్ అభ్యర్థుల అంశాలపై చర్చ ..?



టీ మీడియా , అక్టోబర్ 22 , అమరావతి బ్యూరో:
రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమావేశమై చర్చించినట్లు సమాచారం. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టు ఆదేశాలు, ఎన్నికల వాయిదా నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులు, కూటమి పార్టీల్లో రెబల్ అభ్యర్థుల వ్యవహారంపై ఇరువురు నేతలు సమాలోచనలు జరిపినట్లు తెలిసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నెలకొన్న పరిస్థితులపైనా చర్చించినట్లు సమాచారం.

ఎన్నికల తాజా పరిణామాలపై ఆరా

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల తుది జాబితా విడుదలను నిలిపివేయాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకున్న మార్పులు, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం తదుపరి నిర్ణయంతో పాటు ఎన్నికల నిర్వహణకు సంబంధించి అనుసరించాల్సిన విధానంపైనా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం.

రెబల్ అభ్యర్థుల అంశంపైనా చర్చ?

స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయం, అభ్యర్థుల (మిగతా 2లో)

జనగణనలో ఎవరూ చేయని సాహసం చేశాం



⏭ **బీసీ వర్గీకరణపై కేబినెట్‌లో చర్చిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి**

టీ మీడియా, అక్టోబర్ 22, హైదరాబాద్ బ్యూరో:
పేదల పక్షాన నిలబడి, భూస్వాములు, దొరల దోపిడీని ఎదిరించి, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన యోధుడు పండుగ సాయన్న అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలకు అండగా నిలిచిన ఆయన చరిత్రను నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. ముదిరాజుల సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే అంశాన్ని మంత్రివర్గంలో చర్చిస్తామని ప్రకటించారు.

భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు

నిజాం పాలనలో భూస్వాములు, దొరలు పేదల భూములను ఆక్రమిస్తున్న సమయంలో వారికి వ్యతిరేకంగా పండుగ సాయన్న పోరాడారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. దొరలకు వ్యతిరేకంగా దళాన్ని ఏర్పాటు చేసి పేదలకు అండగా నిలిచారని తెలిపారు. పేదలకు ధాన్యం పంపిణీ చేయడంతో పాటు నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సాయం చేసిన ఘనత ఆయనదని కొనియాడారు.

అన్యాయంగా హత్యకు గురైనప్పటికీ, వందేళ్లు దాటినా పండుగ సాయన్న ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని అన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న వంటి పోరాట యోధుల చరిత్రను ప్రజలకు మరింత (మిగతా 2లో)

విహారయాత్రలో విషాదం..



⏭ **నలుగురు మృతి!**

టీ మీడియా, అక్టోబర్ 22, శ్రీకాకుళం బ్యూరో:
శ్రీకాకుళం రూరల్ మండలం పీజీపేట సముద్ర తీరంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సముద్రంలో మునిగి ముగ్గురు యువతులు ప్రాణాలు కోల్పోగా, వారిని రక్షించేందుకు ప్రయత్నించిన ఓ యువకుడు కూడా మృత్యువాత పడ్డాడు. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ శిక్షణ సంస్థకు చెందిన సుమారు 25 మంది విద్యార్థులు దసరా సెలవుల సందర్భంగా విహారయాత్రకు పీజీపేట సముద్ర తీరానికి వెళ్లారు. సముద్ర తీరంలో సరదాగా గడుపుతూ సెల్ఫీలు దిగుతున్న క్రమంలో కొంతమంది యువతులు లోతైన ప్రాంతంలోకి వెళ్లారు. అదే సమయంలో ఉవ్వెత్తున ఎగసిపడిన అలల ధాటికి వారు సముద్రంలో చిక్కుకుపోయారు.ఈ ప్రమాదంలో విజయనగరం జిల్లా గజపతినగరం మండలం కెంగువ గ్రామానికి చెందిన కొండల మాధవి (19), రామభద్రాపురానికి చెందిన గొల్లపల్లి పావని (19), పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం (మిగతా 2లో)

గోదావరి జలాల అంశంపై బీఆర్ఎస్ ఫోకస్



⏭ **సర్కారుపై ఒత్తిడి పెంచే వ్యూహం!**

టీ మీడియా, అక్టోబర్ 22, హైదరాబాద్ బ్యూరో:
గోదావరి జలాల ఎత్తిపోత అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు బీఆర్ఎస్ వ్యూహరచన చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి సుందిళ్ల, అన్నారం బ్యారేజీల మీదుగా ఎల్లంపల్లి జలాశయానికి తరలించాలని గులాబీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

కన్నెపల్లి నుంచి నీటి ఎత్తిపోతకు డిమాండ్

గోదావరి నదిలో నీరు దిగువకు వెళ్తున్నప్పటికీ, కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసే విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. గతంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నేతృత్వంలోని బృందం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి, పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించింది. సుందిళ్ల, అన్నారం బ్యారేజీల భద్రతకు సంబంధించి సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) నివేదికను ప్రస్తావిస్తూ, నీటిని ఎత్తిపోసి ఎల్లంపల్లి జలాశయానికి తరలించాలని గులాబీ నేతలు కోరుతున్నారు. దీనివల్ల సాగునీటితోపాటు తాగునీటి అవసరాలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని వాదిస్తున్నారు.

తాగునీటి అవసరాలపై ఆందోళన

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. సింగూరు (మిగతా 2లో)

తెలంగాణపై బీజేపీ ఫోకస్..



⏭ **డిసెంబర్‌లో మోదీ పర్యటన!**

టీ మీడియా, అక్టోబర్ 22, హైదరాబాద్ బ్యూరో:
తెలంగాణలో భారతీయ జనతా పార్టీ రాజకీయ కార్యకలాపాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిసెంబర్‌లో రాష్ట్రంలో పర్యటించనున్నట్లు రాష్ట్ర బీజేపీ వర్గాలు వెల్లడించాయి. వరంగల్‌లో రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ సెంటర్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో నవంబర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా తెలంగాణలో పర్యటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. పశ్చిమ బెంగాల్ తర్వాత బీజేపీ తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

బీజేపీ ముఖ్య నేతల సమావేశం

హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, (మిగతా 2లో)

సీఎం చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)
ఎంపిక, రెబల్ అభ్యర్థుల పోటీ అంశాలు కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం. కూటమి పార్టీల శ్రేణుల మధ్య సమన్వయం, ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎదురవుతున్న సమస్యలపై ఇరువురు నేతలు మాట్లాడుకున్నట్లు తెలిసింది. అయితే సమావేశంలో చర్చించిన అంశాలపై అధికారిక ప్రకటన వెలువడలేదు.
ఒంటరిగా వచ్చిన పవన్ కల్యాణ్ గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి పవన్ కల్యాణ్ వెళ్లారు. ఎలాంటి కాన్వాయ్ లేకుండా ఒంటరిగా వచ్చిన ఆయన ముఖ్యమంత్రితో కొద్దిసేపు సమావేశమై అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు కొనసాగుతున్న తరుణంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

జనగణనలో ఎవరూ చేయని సాహసం చేశాం

(మొదటి పేజీ తరువాయి)
చేరువ చేయాలని సూచించారు. ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ఆవిష్కరిస్తామని ప్రకటించారు.

కులగణనతో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం

బ్రిటిష్ పాలనలో కులగణన జరిగిందని, దాదాపు వందేళ్ల తర్వాత తమ ప్రభుత్వం మళ్లీ కులగణన చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. జనగణనలో కులగణన నిర్వహించి ఎవరూ చేయని సాహసం చేశామని పేర్కొన్నారు. కులగణన కారణంగా వివిధ కులాలు తమ జనాభా, హక్కులపై బలంగా గళం వినిపిస్తున్నాయని చెప్పారు.
కులగణనలో తమ జనాభా తక్కువగా నమోదైందని ఎవరైనా భావిస్తే, పూర్తి వివరాలు అందించాలని కోరారు. ఆధారాలు పరిశీలించి అవసరమైన సవరణలు చేస్తామని స్పష్టం చేశారు.

ముదిరాజులకు రాజకీయ ప్రాతినిధ్యం

ముదిరాజులకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చే అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సీఎం సూచించారు. ముదిరాజులను ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. వారి సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.సంక్షేమ పథకాల అమలుగత ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే మరింత విస్తృతంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని వివరించారు. బీసీ వర్గీకరణ అంశంపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి అధ్యయనం చేయిస్తామని పేర్కొన్నారు.ముదిరాజుల సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

విహారయాత్రలో విషాదం..

(మొదటి పేజీ తరువాయి)
మావుడి గ్రామానికి చెందిన మర్రి మహి (18) నీటిలో మునిగిపోయారు. వారి ఆర్తనాదాలు విన్న తోటి విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

ప్రాణాలకు తెగించి రక్షించే యత్నం

యువతులు మునిగిపోతుండటాన్ని గమనించిన బిడ్డిక విక్రమ్ (25) వారిని రక్షించేందుకు సముద్రంలోకి దూకాడు. సాహసంతో మహి, పావనిలను ఒడ్డుకు తీసుకొచ్చాడు. అయితే అప్పటికే వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. అనంతరం మరో యువతి మాధవిని కాపాడేందుకు విక్రమ్ మళ్లీ సముద్రంలోకి వెళ్లగా, అలల ఉద్ధృతికి అతను కూడా గల్లంతయ్యాడు.

గాలింపు చర్యలు.. తీరానికి చేరిన మృతదేహాలు

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక మత్స్యకారుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాలించిన అనంతరం గల్లంతైన మాధవి, విక్రమ్ మృతదేహాలు బుధవారం సముద్ర తీరానికి కొట్టుకొచ్చాయి. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విహారయాత్రల్లో అప్రమత్తత తప్పనిసరి

సముద్ర తీరాలు, జలపాతాలు, రిజర్వాయర్ల వద్ద విహారయాత్రలకు వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ఈత రాకపోయినా, నీటి లోతు తెలియకపోయినా సరదా కోసం నీటిలోకి దిగడం ప్రాణాలకే ప్రమాదకరం. అధికారుల హెచ్చరికలను పాటిస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలి. క్షణిక ఆనందం విషాదంగా మారకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

తెలంగాణపై బీజేపీ ఫోకస్..

(మొదటి పేజీ తరువాయి)
రఘునందన్‌రావు హాజరయ్యారు. పార్టీ ముఖ్య నేతలు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ఇతర నాయకులు కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రభుత్వ విధానాలపై నిరసన కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం.

నవంబర్ 1న హైదరాబాద్‌లో నిరసన ర్యాలీ

కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నవంబర్ 1న హైదరాబాద్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించాలని తెలంగాణ బీజేపీ నిర్ణయించింది. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ప్రజల్లోకి వెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నాయకులు యోచిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ.. "ప్రజాస్వామ్యాన్ని రక్షించండి.. గుంపు సామ్యాన్ని ఓడించండి" అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో బీజేపీ పాత్రను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

గోదావరి జలాల అంశంపై బీఆర్ఎస్ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)
జలాశయంలో నీటి నిల్వలు తగ్గుతున్నాయనే అంశాన్ని ప్రస్తావిస్తూ, హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు గోదావరి జలాలు కీలకమవుతాయని పేర్కొంటున్నారు.
ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, నీటి ఎత్తిపోతపై ప్రభుత్వం స్పందించేలా ఒత్తిడి పెంచాలని నగర గులాబీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం.

మేడిగడ్డ పర్యటనకు సన్నాహాలు

హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించే అంశంపై పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రెండు, మూడు రోజుల్లో పర్యటన చేపట్టే అవకాశమున్నట్లు సమాచారం. ఈ పర్యటనలో భాగంగా దిగువకు వెళ్తున్న గోదావరి జలాల పరిస్థితిని పరిశీలించి, నీటిని ఎత్తిపోస్తే కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని నేతలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి పెంచే యత్నం

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ, బ్యారేజీల భద్రత, నీటి ఎత్తిపోత అంశాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య ఇప్పటికే రాజకీయ వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మేడిగడ్డ పర్యటన ద్వారా హైదరాబాద్ తాగునీటి అవసరాల అంశాన్ని ముందుకు తెచ్చి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ భావిస్తోంది. అయితే, నీటి ఎత్తిపోతకు సంబంధించి ప్రభుత్వ నిర్ణయం, ప్రస్తుత ప్రాజెక్టు పరిస్థితులు, సాంకేతిక అంశాలపై అధికారిక స్పష్టత కీలకం కానున్నాయి.

వేలం లేకుండానే జాయింట్ వీల్స్‌కు అవకాశం..?



● రూ.లక్ష డొనేషన్‌తోనే సరిపెట్టారా?

టీ మీడియా ، అక్టోబర్ 22 ، సింగరేణి (కారేపల్లి):
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలోని శ్రీ కోట మైసమ్మ ఆలయ జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జాయింట్ వీల్స్, ఎగ్జిబిషన్ వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. నిర్వాహకుల నుంచి రూ.లక్ష డొనేషన్ తీసుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి (ఈఓ) కే. వెంకటయ్య వెల్లడించడంతో, అసలు ఎగ్జిబిషన్ నిర్వహణకు ఏ ప్రాతిపదికన అనుమతి ఇచ్చారు? బహిరంగ వేలం లేదా టెండర్ ప్రక్రియ నిర్వహించాల్సిన అవసరం ఉందా? ఉంటే ఎందుకు నిర్వహించలేదు? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

వేలం నిర్వహించాల్సి ఉంటే.. ఎందుకు నిర్వహించలేదు?

జాతర సందర్భంగా ఆలయ పరిధిలో వాణిజ్యపరంగా జాయింట్ వీల్స్, ఎగ్జిబిషన్ నిర్వహణ హక్కులను కేటాయించేందుకు దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం బహిరంగ వేలం లేదా ఇతర పోటీ ప్రక్రియ అవసరమా? అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.ఒకవేళ వేలం నిర్వహించాల్సిన నిబంధనలు వర్తిస్తే, పోటీ విధానం ద్వారా ఆలయానికి మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉండగా, కేవలం రూ.లక్ష డొనేషన్‌తోనే ఎందుకు సరిపెట్టారు? వేలం నిర్వహించకపోవడం వల్ల ఆలయానికి రావాల్సిన ఆదాయంలో ఏమైనా నష్టం జరిగిందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.మరోవైపు, వేలం అవసరం లేదని అధికారులు భావిస్తే, ఏ నిబంధన లేదా ఉత్తర్వుల ఆధారంగా డొనేషన్ స్వీకరించి ఎగ్జిబిషన్ నిర్వహణకు అవకాశం కల్పించారో వెల్లడించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

డొనేషన్ చెల్లిస్తే నిర్వహణ హక్కులు వచ్చినట్లేనా?

నిర్వాహకుల నుంచి రూ.లక్ష డొనేషన్ తీసుకున్నట్లు ఈఓ వెల్లడించిన నేపథ్యంలో, ఆ మొత్తానికి అధికారిక రసీదు జారీ చేశారా? డబ్బు ఆలయ అధికారిక ఖాతాలో జమైందా? డొనేషన్‌కు, ఎగ్జిబిషన్ నిర్వహణకు మధ్య ఏదైనా సంబంధం ఉందా? లేక అది స్వచ్ఛందంగా ఇచ్చిన విరాళం మాత్రమేనా? అనే వివరాలు తెలియాల్సి ఉంది.
డొనేషన్ చెల్లించినందుకే జాయింట్ వీల్స్, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించారా? లేక ఇందుకోసం ప్రత్యేకంగా అనుమతి ఉత్తర్వులు జారీ చేశారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

దేవాదాయ శాఖ ఆదాయానికి నష్టం జరిగిందా?

జాతరలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే సమయంలో ఎగ్జిబిషన్లు, వినోద పరికరాల నిర్వహణకు వాణిజ్యపరమైన విలువ ఉంటుంది. ఇలాంటి నిర్వహణ హక్కులను పారదర్శకమైన పోటీ విధానంలో కేటాయిస్తే ఆలయానికి ఎంత ఆదాయం వచ్చేది? ప్రస్తుతం స్వీకరించిన రూ.లక్ష డొనేషన్‌తో పోలిస్తే ఎంత తేడా ఉండేది? అనే అంశాలను ఉన్నతాధికారులు పరిశీలించాల్సి ఉంది.
వేలం నిర్వహించాల్సిన నిబంధనలు వర్తించినప్పటికీ ప్రక్రియ చేపట్టలేదని విచారణలో తేలితే, ఆలయానికి రావాల్సిన ఆదాయానికి నష్టం జరిగిందా? జరిగితే అందుకు బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది.
జాయింట్ వీల్స్‌కు భద్రతా పత్రాలు ఉన్నాయా? ఆదాయ అంశంతోపాటు భక్తుల భద్రత కూడా అత్యంత కీలకం. జాయింట్ వీల్స్ వంటి భారీ వినోద పరికరాలకు అవసరమైన ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు, బీమా, విద్యుత్ భద్రతా ఏర్పాట్లు, వర్తించే ఇతర అనుమతులు ఉన్నాయా? గ్రామపంచాయతీ నుంచి అవసరమైన అనుమతులు పొందారా? సంబంధిత అధికారులు పరికరాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారా? అనే వివరాలు వెల్లడించాల్సి ఉంది.ఏదైనా ప్రమాదం సంభవిస్తే బాధ్యత ఎవరు తీసుకుంటారు? నిర్వాహకులకు తగిన బీమా సదుపాయం ఉందా? అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స సదుపాయాలు, ఇతర భద్రతా ఏర్పాట్లు చేశారా? అనే అంశాలపైనా అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.డొనేషన్ లెక్కలు.. అనుమతుల వివరాలు వెల్లడించాలి.ఈ మొత్తం వ్యవహారంపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, రూ.లక్ష డొనేషన్ ఏ ప్రాతిపదికన స్వీకరించారు? దానికి రసీదు జారీ చేశారా? వేలం లేదా టెండర్ అవసరం ఉందా? ఉంటే ఎందుకు నిర్వహించలేదు? ఎగ్జిబిషన్ నిర్వహణకు ఎవరు అనుమతి ఇచ్చారు? గ్రామపంచాయతీతోపాటు ఇతర సంబంధిత శాఖల అనుమతులు పొందారా? జాయింట్ వీల్స్‌కు అవసరమైన ఫిట్‌నెస్, బీమా, భద్రతా పత్రాలు ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది.అన్ని ప్రక్రియలూ నిబంధనల ప్రకారమే జరిగి ఉంటే సంబంధిత అనుమతి పత్రాలు, డొనేషన్ వివరాలను వెల్లడించి ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఒకవేళ నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు లేదా ఆలయ ఆదాయానికి నష్టం వాటిల్లినట్లు విచారణలో తేలితే, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



పోరాట యోధుడు పండుగల సాయన్న

టీ మీడియా, అక్టోబర్ 22 ,పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో పండుగల సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పండుగల సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పండుగల సాయన్న జీవితాన్ని ఆయన పోరాట స్ఫూర్తిని ప్రజల కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు ఆయన ఆశయాలు ధైర్యసాహసాలు సామాజిక చైతన్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు ఈ జయంతి వేడుకలో పండుగల సాయన్న సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రేరణగా నిలిచాయి ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు అధ్యక్షులు చింతకాయల కురుమూర్తి గోనెల గోల్డ్ బాలస్వామి గోనెల సహదేవుడు సొప్పరి బీచు పల్లి(జిల్లా డైరెక్టర్) చింతకాయల భీముడు సంగనమోని శ్రీనివాసులు చింతకాయల శివ కరెన్న తిరుపతయ్యా రాజు శాంతయ్య ఎల్లయ్యా కె రాముడు సాయి హమాలీ సంఘం అధ్యక్షులు ఆంజనేయులుకటికల శివాజీ బజారు అంజి ప్రకాష్ కాశీ బోల్గరి నరసింహ స్థానిక ప్రజలు యువకులు అభిమానులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.




ఖేత్ బచావో అభియాన్

టి మీడియా , అక్టోబర్22, ఖమ్మం రూరల్ :
ఏదులపురం మున్సిపాలిటీ ముత్తగూడెం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజేష్ గారు, మండల వ్యవసాయ అధికారి జె. ఉమా నాగేశ్ గారు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏ వి ఓ లు), రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతులకు నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, సమతుల్య ఎరువుల యాజమాన్యం, సహజ వ్యవసాయం, పంట అవశేషాల నిర్వహణ, నీటి సంరక్షణ, సమగ్ర సస్యరక్షణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ప్రణాళిక తదితర అంశాలపై అవగాహన కల్పించారు.పంట అవశేషాలను కాల్చకుండా సమర్థవంతంగా వినియోగించడం, నేల ఆరోగ్యాన్ని కాపాడటం, నీటిని పొదుపుగా వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకుని మెరుగైన దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు.



రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రైతులు

టీ మీడియా, అక్టోబర్ 22, ఆత్మకూరు :
వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం జూరాల గ్రామంలో రైతు నేస్తం కార్యక్రమం లో గౌరవ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి . ఈ కార్యక్రమంలో నందు వ్యవసాయ శాఖ మంత్రి రైతులకు ఎల్‌నినో ప్రభావం రైతులు ఎదుర్కొనే ఇబ్బందులు వాతావరణ ప్రభావము వలన రైతుల పంట నష్టం కలుగకుండా పంటమార్పిడి పత్తి రైతుల కు జజ× ద్వారా కొనుగోలు చేయుటకు ఇతర విషయాలపై రైతులకు ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయడమైనది.ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండిరహమతుల్లా వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తులసి రాజు యాదవ్ పరమేష్ ,జూర్యాల మధు, అబ్దుల్ , రాజేందర్ శాస్త్రవేత్త మదనపురం , జిల్లా వ్యవసాయ



అధికారి, ఆంజనేయులు , రమేష్ నాయక్ మార్కెట్ కమిటీ సెక్రటరీ సిబ్బంది, ఆత్మకూరు ఆత్మకూరు వ్యవసాయ అధికారి , శ్రీనివాసులు మండల రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



టి మీడియా, అక్టోబర్ 22, ఖమ్మం రూరల్ :
ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డు వరంగల్ క్రాస్ రోడ్డులో సీసీ రోడ్ల నిర్మాణ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. 29వ వార్డు కౌన్సిలర్ వెంపటి ఉమా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులను ఏదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ ముఖ్య అతిథులుగా హాజరై కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు.29వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి గౌరవ శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి గారికి కౌన్సిలర్ వెంపటి ఉమా వెంకటేశ్వర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సోము వెంకటేశ్వర రెడ్డి, బానోత్ ప్రసాద్, ఏదులాపురం మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు వెంపటి సురేష్, మున్సిపాలిటీ బీసీ సెల్ అధ్యక్షులు వెంపటి రవి, 29,31,32 వార్డుల అధ్యక్షులు గణపారపు వీరన్న, రామిశెట్టి రమేష్, మిర్యాల నరుణ్ తేజ్, యువజన కాంగ్రెస్ నాయకులు రెబ్బగుండ్ల గోపి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సురేష్ రెడ్డి బొడ్డు హర్షవర్ధన్,ఏపూరి తరుణ్ ,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ వద్ద ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

⏭ నీటి వనరుల పరిరక్షణ అందరి బాధ్యత: సర్పంచ్ దండు ప్రవీణ్

టీ మీడియా,అక్టోబర్22,సింగరేణి(కారేపల్లి):
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్ద చెరువు 'అమృత్ సరోవర్' వద్ద గురువారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.భారత ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ క్యాంపెయిన్–6లో భాగంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చెరువు పరిసరాల్లో పరిశుభ్రత పనులు చేపట్టారు.ఈ సందర్భంగా స్వచ్ఛంద శ్రమదానం నిర్వహించడంతో పాటు చెరువు పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు.నీటి వనరుల పునరుజ్జీవనం,వాటి సమర్థవంతమైన నిర్వహణ,పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడంతో పాటు చెరువులు,ఇతర నీటి వనరులను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ దండు ప్రవీణ్ పేర్కొన్నారు.ఎల్‌నీనోపై



రైతులకు శిక్షణఅనంతరం అప్పాయిగూడెం రైతు వేదికలో ఆత్మ ఆధ్వర్యంలో ఎల్‌నీనో ప్రభావాలపైరైతులకుఅవగాహన,శిక్షణకార్యక్రమ ంనిర్వహించారు.ఎల్‌నీనోకారణంగావాతావరణం లో సంభవించే మార్పులు,వ్యవసాయంపై పడే ప్రభావం,పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు,వ్యవసాయ శాఖ సూచనలు పాటించాల్సిన ఆవశ్యకతపై అధికారులు వివరించారు.గ్రామంలో పర్యావరణ పరిరక్షణ,నీటి వనరుల సంరక్షణతో పాటు రైతులకు ఉపయోగపడే వ్యవసాయ అవగాహన కార్యక్రమాలను నిరంతరం చేపడతామని సర్పంచ్ దండు ప్రవీణ్ తెలిపారు.ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ అధికారి బట్టు అశోక్ కుమార్,ఈసీ సుధీర్,ఏఈవో మున్నీ,వార్డు సభ్యుడు కుంజా కృష్ణ ప్రసాద్,రైతులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

⏭ ఫ్యాక్టరీ నిర్వహణపై మంత్రి తుమ్మల ఆరా

టీ మీడియా, అక్టోబర్ 22,దమ్మపేట:
ఆయిల్ పామ్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పంట కొనుగోళ్లు సకాలంలో చేపట్టి క్రషింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో క్రషింగ్ ప్రక్రియ, రైతుల నుంచి ఆయిల్ పామ్ గెలల రాక, ఫ్యాక్టరీ నిర్వహణ తదితర అంశాలపై ఆయన ఆరా తీశారుదసరా పండుగను పురస్కరించుకుని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్ మంద నాగబాబు మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి



వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఫ్యాక్టరీలో జరుగుతున్న క్రషింగ్ కార్యకలాపాలు, ఆయిల్ పామ్ గెలల దిగుబడులు, కొనుగోళ్ల పరిస్థితి, ఫ్యాక్టరీ నిర్వహణపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేసి, క్రషింగ్ ప్రక్రియలో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ ఫ్యాక్టరీ కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.ఆయిల్ పామ్ రైతుల సంక్షేమానికి, ఫ్యాక్టరీ అభివృద్ధికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందిస్తున్న సహకారానికి మంద నాగబాబు కృతజ్ఞతలు తెలిపారు.

గడిపల్లి వెంకటేశ్వర్లు కి ఘననివాళి



టి మీడియా ,అక్టోబర్ 22:,ఖమ్మం రూరల్ :
ఖమ్మం రూరల్, చింతపల్లి గ్రామం శ్రీనగర్ కాలనీ లో గడిపల్లి వెంకటేశ్వర్లు అకాల మరణం చెందినారు అన్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోట వీరభద్రం వెంకటేశ్వర్లు పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసినారు వారితో పాటు చింతపల్లి మాజీ సర్పంచ్ ముత్యం చిన్న కృష్ణారావు గ్రామశాఖ అధ్యక్షులు పగిళ్ల మహేష్ గ్రామశాఖ ఉపాధ్యక్షులు కటారి కోటయ్య తూము రామారావు గారు, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు వల్లపు నాగయ్య తోట ఎల్లయ్య బొమ్మగాని వెంకన్న బొమ్మగాని వీరభద్రం కోడె ప్రవీణ్ ఆరెంపుల బద్రిసాయి, తదితరులు నివాళులర్పించినారు.

అష్ఫాఖుల్లా ఖాన్ జయంతి వేడుకలు



టీ మీడియా ,అక్టోబర్ 22 , పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీలో అమరవీరుడు అష్ఫాఖుల్లా ఖాన్ 127వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సుభాష్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అష్ఫాఖుల్లా ఖాన్ చేసిన త్యాగాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ఇలాంటి మహనీయుల జయంతి వేడుకలను నిర్వహించడం ద్వారా ఐక్యత, దేశభక్తి భావాలను పెంపొందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఖాజా ఆవాజ్ కమిటీ సభ్యులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పలువురు పాల్గొని అమరవీరుడికి ఘనంగా నివాళులర్పించారు.

పండగ సాయన్న జయంతి ఉత్సవాలు

టీ మీడియా, అక్టోబర్ 22 ,ఆత్మకూర్:
వనపర్తి జిల్లా ఆత్మకూరు మునిసిపాలిటీ గాంధీ చౌరస్తాలో పాలమూరు ముదిరాజ్ ముద్దుబిడ్డ తెలంగాణ రాబిన్ హుడ్, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి శ్రీ శ్రీ పండుగల సాయన్న ముదిరాజ్ గారి 174వ జయంతి ఉత్సవాలు ఆత్మకూర్ మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పండుగల సాయన్న గురించి వారు చేసిన పనుల గురించి తెలియజేస్తూ అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా పండుగల సాయన్న జయంతి ఉత్సవాలను జరిపి నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షులు అశ్విన్ కుమార్, నాగరాజు, బుడ్డరాజు, గోవర్ధన్, బుచ్చన్న, పరుశురామ్, విజయ కుమార్, ఆనంద్, రమేష్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ ను డికొట్టిన ద్వి చక్ర వాహనం ఒకరు మృతి

టీ మీడియా, అక్టోబర్ 22 ,పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం వనపర్తి చిట్యాల రోడ్డు పై గల చింతల హనుమాన్ గుడి సమీపంలో గల పెట్రోల్ బంక్ దగ్గర బుదవారం రాత్రి 8 30 గం ల ప్రాంతంలో పెబ్బేరు కు మెట్టుపల్లె కు చెందిన ఇద్దరు అబ్బాయిలు చిట్యాల లో దుర్గా మాత వేడుకలు చూసి వస్తున్న క్రమంలో వారు ప్రయాణిస్తున్న కె టి ఎం ద్వీ చక్ర వాహనం అదుపు తప్పి డివైడర్ ను డి కొట్టడంతో ఇద్దరికీ ముఖానికి చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి ఇది గమనించిన స్థానికులు గాయపడ్డవారిని ఆటో లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఒకరు మృతి మరొకరిని అత్యవసర వైద్య శి కోసం హైద్రాబాద్ తరలించారు వివరాలు తెలియాల్సి వుంది.



చిన్నారి వైద్యానికి రూ.20 లక్షల ఎల్ఓసీ



⏭ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవ

టీ మీడియా,అక్టోబర్22,సింగరేణి(కారేపల్లి):
వినికిడి లోపంతో బాధపడుతున్న చిన్నారి వైద్యానికి రూ.20 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించడంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవ చూపారు.కారేపల్లికి చెందిన చింతల సందీప్ కుమార్తె చింతల విశిక వెన్నెల శ్రీ పుట్టుక నుంచే వినికిడి లోపంతో బాధపడుతోంది.తల్లిదండ్రులు తమ స్థోమతకు మించి ఇప్పటికే వైద్యం చేయించగా,మెరుగైన చికిత్స కోసం కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స అవసరమైంది.విషయం ఎమ్మెల్యే రాందాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చొరవ తీసుకుని శస్త్రచికిత్సకు అవసరమైన రూ.20 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు.సంబంధిత ఎల్ఓసీ పత్రాన్ని గురువారం వైరా క్యాంపు కార్యాలయంలో చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు.శస్త్రచికిత్స అనంతరం చిన్నారిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.తమ చిన్నారి వైద్యానికి పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రిపోర్టర్ గంగన్న యాదవ్ కుటుంబాన్ని



⏭ పరామర్శించిన డాక్టర్ రాజారమేష్

టీ మీడియా, అక్టోబర్ 22, రామకృష్ణాపూర్:

క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన రిపోర్టర్ పురుషోత్తం గంగన్న యాదవ్ సతీమణి పురుషోత్తం పద్మ అనారోగ్యంతో గురువారం తెల్లవారి జామున మృతి చెందారు.విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజారమేష్ ,గంగన్న యాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. పద్మ ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబానికి మనోధైర్యం కలగాలని కోరారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మంద వేణు, బబ్బేర ఉపేందర్, యూత్ నాయకులు రామిడి లక్ష్మికాంత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు భవానీ భక్తులు మృతి!



టీ మీడియా, అక్టోబర్ 22, కాకినాడ:

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నడుచుకుంటూ వెళ్తున్న భవానీ భక్తులపైకి స్కార్పియో వాహనం దూసుకెళ్లడంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన కత్తిపూడి--రావికంపాడు జంక్షన్ సమీపంలో జరిగింది.వివరాల్లోకి వెళ్తే.. విజయనగరం జిల్లా డెంకాడ నుంచి కొంతమంది భవానీ భక్తులు విజయవాడలో అమ్మవారి దర్శనం కోసం ప్రైవేట్ బస్సులో బయలుదేరారు. మార్గమధ్యలో బస్సు మరమ్మతులకు గురైంది. దీంతో టీ తాగేందుకు భక్తులు నడుచుకుంటూ వెళ్తుండగా, ఒక్కసారిగా స్కార్పియో వాహనం వారిపైకి దూసుకెళ్లింది.

ఈ ప్రమాదంలో నలుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం: ఏవో నాగేశ్వరరావు



టీ మీడియా అక్టోబర్ 22 ముదిగొండ, :

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున యాసంగిలో వరి, మొక్కజొన్నకు బదులుగా పెసర, కుసుమ వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి వి. నాగేశ్వరరావు రైతులకు సూచించారు. గురువారం ముదిగొండ, మాదాపురం, పమ్మి రైతు వేదికల్లో నిర్వహించిన రైతు నేస్తం ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో భాగంగా సాగుభూమి సంరక్షణపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు చేయించుకొని, నేల స్వభావానికి అనుగుణంగా పంటలు సాగు చేయాలని సూచించారు. మండలంలో పెసర, కుసుమ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరావు, డైరెక్టర్లు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ఏఈవోలు, మార్కెటింగ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మైసయ్య కుటుంబాన్ని పరామర్శించిన కందాల



టీ మీడియా ,అక్టోబర్ 22 ,కూసుమంచి;

అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కనకం మైసయ్య కుటుంబాన్ని, ఆయన స్వగృహం కూసుమంచిలో గురువారం పాలేరు మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి పరామర్శించారు. మైసయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మైసయ్య సతీమణి ఉమాని ఓదార్చి, ధైర్యం చెప్పారు. మైసయ్య కుల, మత, రాజకీయాల కతీతంగా అందరితో కలివిడిగా కలిసి ఉండేవారని ఈ సందర్భంగా కందాల ఉపేందర్ రెడ్డి స్మరించారు. ఈ కార్యక్రమములు బి ఆర్ ఎస్ జిల్లా పార్టీ నాయకులు మళ్లీ దు వెంకటేశ్వరరావు, కూసుమంచి మండల బిఆర్ఎస్ కార్యదర్శి మహమ్మద్ ఆసిఫ్, కందాల అభిమాని దాసరి వెంకన్న, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు చెరుకుపల్లి వీరయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బెల్లంకొండ కిరణ్, తదితరులు పాల్గొని నివాళు అర్పించారు.

గుంపులుగా గుమిగూడడం నిషిద్ధం

⏭ ఊరేగింపులు, ర్యాలీ లకు అనుమతి తప్పని సరి

⏭ జిల్లా యస్ పి కే చక్రవర్తి



టీ మీడియా, అక్టోబర్22,చింతూరు;

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, చట్టబద్ధంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా కఠినమైన పోలీస్ ఆంక్షలు అమలులో ఉన్నాయని జిల్లా ఎస్పీ కె చక్రవర్తి అన్నారు. స్థానిక ఎన్నికలు సందర్భంగా ఎంపిటిసి అభ్యర్థులు గురువారం స్థానిక ఎండిఓ ఆఫీసులో నామినేషన్ లు అధికారులకు సమర్పిస్తున్నారు. ఈ కేంద్రాన్ని ఎస్పీ చక్రవర్తి సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గుంపులుగా చేరడం నిషేధమన్నారు. నామినేషన్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో, నామినేషన్ల సమయంలో అభ్యర్థులు, వారి మద్దతుదారులు గుంపులుగా చేరడాన్ని పూర్తిగా నిషేధించామన్నారు . నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు నిబంధనల ప్రకారం పరిమిత సంఖ్యలో (1o2) వ్యక్తులను మాత్రమే అనుమతిస్తామన్నారు .అభ్యర్థులు తమ నామినేషన్ల దాఖలు సమయాలను ముందుగానే స్థానిక పోలీసు అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు . దీనివల్ల అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవకాశం ఉంటుందన్నారు .పోలీసు చట్టం (రూల్ 30) అమలు జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం పోలీసు చట్టం ఆంక్షలు అమలులో ఉన్నందున పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు లేదా సభలు నిర్వహించరాదని పేర్కొన్నారు . మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తనా నియమావళి) అమల్లో ఉన్నందున, ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా, నామినేషన్ల ప్రక్రియకు ఆటంకం కలిగించినా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయన్నారు .ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా, పారదర్శకంగా ముగించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలందరూ పోలీస్ శాఖకు పూర్తిగా సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతోపాటు ఎస్ డి ఓ పి ఉదయభావని, సిఐ గోపాలకృష్ణ, ఎస్సై సంతోష్ కుమార్, తహసిల్దార్ అర్జున్ రావు, ఎంపీడీవో శ్రీనివాస్ దొర తదితరులు పాల్గొన్నారు.

కర్రల సమరంలో చిందిన రక్తం

⏭ ఒకరు మృతి.. 100 మందికి పైగా గాయాలు!



టీ మీడియా, అక్టోబర్ 22, కర్నూలు బ్యూరో:

కర్నూలు జిల్లా హోళగుంద మండలం దేవరగట్టులో బన్ని ఉత్సవం మరోసారి రక్తసిక్తమైంది. శ్రీ మాల మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు సందర్భంగా నిర్వహించిన కర్రల సమరంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అర్ధరాత్రి దాటిన తర్వాత గ్రామస్తులు కర్రలు, రాళ్లు, దివిటీలతో పరస్పరం దాడులకు దిగడంతో ఉత్సవ ప్రాంగణం రణరంగంగా మారింది. ఈ ఘటనలో ఆలూరుకు చెందిన పోతురాజు (28) మృతి చెందగా, 100 మందికి పైగా గాయపడినట్లు ప్రాథమిక సమాచారం.

సంప్రదాయ ఉత్సవంలో హింసాత్మక ఘర్షణలు

దేవరగట్టులో ప్రతి ఏడాది నిర్వహించే బన్ని ఉత్సవంలో భాగంగా శ్రీ మాల మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను కొండపై నుంచి కిందికి తీసుకొస్తున్న సమయంలో ఘర్షణలు ప్రారంభమయ్యాయి. నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాలకు చెందిన భక్తులు ఉత్సవ మూర్తులను తీసుకొస్తుండగా, ఆలూరు, అరికెర, ఎల్లార్తి తదితర గ్రామాల ప్రజలు కర్రలతో ఎదురుపడ్డారు.

సంప్రదాయబద్ధంగా సాగే కర్రల సమరం క్రమంగా తీవ్ర ఘర్షణలకు దారితీసింది. ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లు విసురుకోవడంతో పాటు దివిటీలతో దాడులకు దిగారు. సుమారు రెండు గంటలపాటు ఈ ఘర్షణలు కొనసాగినట్లు సమాచారం. ఉత్సవానికి లక్ష మంది వరకు హాజరుకాగా, దాదాపు 30 వేల మంది కర్రల సమరంలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు అంచనా.

ఒకరు మృతి.. పలువురికి తీవ్ర గాయాలు

కర్రల దాడులు, తోపులాట, తొక్కిసలాట కారణంగా మహిళలు, యువకులు సహా పలువురు గాయపడ్డారు. కొందరికి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులకు కూడా గాయాలైనట్లు సమాచారం. ఆలూరుకు చెందిన పోతురాజు కర్రల సమరంలో అస్వస్థతకు గురై మృతి చెందినట్లు తెలుస్తోంది. ఊపిరాడక ఆయన మరణించినట్లు వైద్యులు తెలిపినట్లు సమాచారం.

క్షతగాత్రులకు దేవరగట్టులో ఏర్పాటు చేసిన ప్రాథమిక వైద్య శిబిరంలో చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని అంబులెన్సుల్లో ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరికొందరిని మెరుగైన వైద్యం కోసం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.

భారీ పోలీసు బందోబస్తు ఉన్నా ఆగని ఘర్షణలు

ఉత్సవం సందర్భంగా సుమారు వెయ్యి మంది పోలీసులను మోహరించినప్పటికీ ఘర్షణలను పూర్తిగా అదుపు చేయలేకపోయినట్లు సమాచారం. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో పోలీసులు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేసినా, ఘర్షణలకు దిగిన గ్రామస్తులు వాటిని పట్టించుకోలేదని తెలుస్తోంది.

పరిస్థితి అదుపు తప్పడంతో ప్రత్యేక పోలీసు బలగాలు హెల్మెట్లు ధరించి గుంపుల మధ్యకు వెళ్లాల్సి వచ్చింది. పెద్ద సంఖ్యలో దివిటీలను ఒకరిపై ఒకరు విసురుకోవడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది.

కొనసాగుతున్న ఉద్రిక్తత

దేవరగట్టులో ఘర్షణల అనంతరం పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టే అవకాశం ఉంది. సంప్రదాయంగా నిర్వహించే ఉత్సవం హింసాత్మక ఘర్షణలకు దారితీయడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది.

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం



టీ మీడియా, అక్టోబర్ 22, హైదరాబాద్ బ్యూరో :

తెలంగాణ రాష్ట్రంలో 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోళ్లు అధికారికంగా ప్రారంభమయ్యాయి. వ్యవసాయ రంగంలో కీలకమైన ఈ పంట విక్రయాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి పూర్తి గిట్టుబాటు ధర దక్కేలా చూడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను గట్టిగా ఆదేశించారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి జాప్యానికి ఆస్కారం లేకుండా వేగవంతంగా ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం క్వింటా పత్తికి కనీస మద్దతు ధర (మ్యూ)ను రూ. 8,667గా నిర్ణయించగా, ప్రస్తుతం రాష్ట్రంలో పత్తి ధర మార్కెట్‌లో సుమారు రూ. 9,000 వరకు పలకడం రైతులకు ఎంతో ఊరటను, హర్షాన్ని కలిగిస్తోంది.మ్యాప్‌లు చూడండి

భారీగాదిగుబడి అంచనాలు

ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 48.20 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రైతులు పత్తిని విస్తారంగా సాగు చేశారు. అనుకూలించిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, రాష్ట్రంలో సుమారు 29.43 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ భారీ దిగుబడికి అనుగుణంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా,రాష్ట్ర మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో అవసరమైన అన్ని కొనుగోలు కేంద్రాలను, మౌలిక వసతులను సిద్ధం చేశారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల నుంచే కొనుగోళ్లు జరిపి, త్వరితగతిన చెల్లింపులు అందేలా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది.

ఇందిరమ్మ ఇళ్ల అక్రమాలపై వామపక్షాల గర్జన

- ముట్టడితో దద్దరిల్లిన ఖమ్మం కలెక్టరేట్

టీ మీడియా, అక్టోబర్ 22, ఖమ్మం:

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో జరుగుతున్న అక్రమాలను ఎండగడుతూ, పాలకవర్గాల అహంకారానికి వ్యతిరేకంగా ఎర్రజెండాలు, బీఆర్ఎస్ పార్టీ ఒకే తాటిపైకి వచ్చి గురువారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ వేదికగా సాగించిన చారిత్రాత్మక ధర్నా పోరాటం ఖమ్మం కలెక్టరేట్ దద్దరిల్లేలా చేసింది. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో సాగుతున్న వివక్షా రాజకీయాలను, అర్హులైన నిరుపేదల పొట్టకొట్టే కుట్రలను ఎండగడుతూ వామపక్షాలు, బీఆర్ఎస్ శ్రేణులు ఉమ్మడిగా సమరశంఖం పూరించాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది సైనికులాంటి కార్యకర్తలు ఎర్రజెండాలను చేతబూని కదం తొక్కుతుంటే, అధికార పీఠం గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ప్రభుత్వ నిర్బంధాలను, వందలాదిగా మోహరించిన పోలీసు బలగాల వలయాలను సైతం లెక్కచేయకుండా మొక్కవోని ధైర్యంతో కలెక్టరేట్ ముట్టడికి దూసుకెళ్లిన ఆ పీడిత జనాల ఉబికివస్తున్న ఉద్వేగం చూసేవారందరిలోనూ రోమాలు నిక్కబొడుచుకునేలా చేసింది. పేదవాడి సొంతింటి కలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కఠిన ప్రభుత్వ వైఖరిపై నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. అర్హులైన పేదలను అణచివేయాలని చూసే పాలక వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనించిన నినాదాలు కలెక్టరేట్ గోడల్లో



ప్రతిధ్వనించాయి . అన్యాయాన్ని ఎదిరించి నిలబడిన ఆ ప్రజా శంఖారావం నిరుపేదల హక్కుల కోసం ఏ క్షణమైనా వెనకడుగు వేయబోమనే గట్టి హెచ్చరికను అధికార పార్టీకి స్పష్టంగా వినిపించింది. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో జరుగుతున్న అక్రమాలకి, రాజకీయ వివక్షతకు చరమగీతం పాడే వరకు ఈ పోరాటం ఆగదనే అచంచల విశ్వాసాన్ని వామ పక్షాల ఐక్య పోరాటం చాటిచెప్పింది. పోలీసుల మోహరింపులు, ముందస్తు ఆంక్షలు ఆ ఎర్ర దండు ముందు తలవంచక తప్పలేదు. నిరుపేదల ఆవేదనను, ఆక్రోశాన్ని కలెక్టర్ ముందు ఉంచి వామపక్ష, బీఆర్ఎస్ నాయకులు చేసిన ఈ గర్జన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల కంటే ఏ శక్తీ గొప్పది కాదని మరోసారి రుజువు చేసింది.ఈ సందర్భంగాసిపిఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాపాలన పేరుతో లబ్ధిదారులను ఎంపిక చేసినా, ఇందిరమ్మ కమిటీలను రాజకీయాలకు అతీతంగా వేస్తామని చెప్పి ఏ గ్రామంలోనూ కాంగ్రెస్ వారు కాకుండా ఇంకెవరికీ చోటు ఇవ్వలేదని మండిపడ్డారు. సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రసంగిస్తూ ఇందిరమ్మ పథకంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో జరుగుతున్న లోపాలను ప్రభుత్వం సరిచేసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలను, స్థానిక సంస్థల ప్రతినిధుల అధికారాలను అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని, ఇది సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ



కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలకు లేదా పార్టీ కండువా కప్పుకున్న వారికే ఇళ్లు కేటాయిస్తూ దుర్మార్గమైన పాలన సాగిస్తోందని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల సర్పంచుల ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలేరు మాజీ ఎమ్మెల్యే కే ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, మాది ప్రజాప్రభుత్వం, పేదల ప్రభుత్వం, ఇందిరమ్మ ప్రభుత్వం అని స్టాండర్డ్ డైలాగులు పేపర్లలో చూస్తుంటారని, కానీ ఇందిరమ్మ ప్రభుత్వమో, పేదల ప్రభుత్వమో అనుకుంటే ప్రజలు అంటే ఓన్లీ కాంగ్రెస్ పార్టీలో ఉన్నవాళ్లే ప్రజలా, వీళ్ళు కొత్త నిర్వచనాలు, వివాదాలు సృష్టిస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. ప్రమాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

కలెక్టర్ కు వినతిపత్రం

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ ను అఖిల పక్ష నాయకులు కలిసి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు, రాజకీయ వివక్ష ను వివరించి, వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమం లో సీపీఎం జిల్లా నాయకులు బండి రమేష్, యర్రా శ్రీనివాసరావు, పొన్నం వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావుసిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సీ వై పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ



- నాలుగు జిల్లాల్లో ప్రారంభం కాని దరఖాస్తుల పరిశీలన

టీ మీడియా, అక్టోబర్ 22, హైదరాబాద్ బ్యూరో:

తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్ల నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. మూడు వారాలు గడిచినా గత ఓటర్ల జాబితాతో పోలిస్తే సగం దరఖాస్తులు కూడా అందలేదు. మరోవైపు, ఎన్నికల సిబ్బంది ఎస్ఐఆర్ ప్రక్రియలో నిమగ్నం కావడంతో పట్టభద్రుల ఓటర్ల దరఖాస్తుల పరిశీలన కూడా నత్తనడకన సాగుతోంది. హైదరాబాద్ సహా నాలుగు జిల్లాల్లో ఇప్పటివరకు పరిశీలన ప్రారంభం కాలేదు. రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో గతంలో సుమారు 10.30 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఈసారి ఇప్పటివరకు సుమారు 4.35 లక్షల దరఖాస్తులు మాత్రమే అందాయి.

మూడోవంతు మందే ఫారం–18 సమర్పణ

మహబూబ్‌నగర్––రంగారెడ్డి––హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,91,360 దరఖాస్తులు అందగా, వరంగల్––ఖమ్మం––నల్గొండ నియోజకవర్గంలో 2,44,349 దరఖాస్తులు వచ్చాయి. ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్న పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది.

ఇందులో భాగంగా ఓటర్ల నమోదుకు గత నెల 28న నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. ఇందుకోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ఫారం–18 సమర్పించే అవకాశం కల్పించింది.2021లో ఎన్నికలు జరిగినప్పుడు మహబూబ్‌నగర్––రంగారెడ్డి––హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలో 5,31,268 మంది, వరంగల్––ఖమ్మం––నల్గొండ నియోజకవర్గంలో 5,05,565 మంది ఓటర్లుగా నమోదయ్యారు. గత ఐదేళ్లలో డిగ్రీ పూర్తి చేసినవారు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అర్హత పొందినవారిని పరిగణనలోకి తీసుకుంటే ఈసారి రెండు నియోజకవర్గాల్లో కలిపి సుమారు 11.50 లక్షల మంది ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే, నమోదు ప్రక్రియకు గడువు దగ్గరపడుతున్నా ఇప్పటివరకు సుమారు 4.35 లక్షల దరఖాస్తులే అందాయి.

మహబూబ్‌నగర్––రంగారెడ్డి––హైదరాబాద్ నియోజకవర్గం

ఈ నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 53,491 దరఖాస్తులు అందాయి. మేడ్చల్––మల్కాజిగిరి జిల్లాలో 37,364 మంది పట్టభద్రులు ఫారం–18 సమర్పించారు. ఇతర జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇలా ఉన్నాయి.

వికారాబాద్: 15,000,హైదరాబాద్: 22,535,మహబూబ్‌నగర్: 18,229,నాగర్‌కర్నూలు: 16,120,వనపర్తి: 11,205,జోగులాంబ గద్వాల: 9,362,నారాయణపేట: 8,034,

ఈ వివరాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం వెల్లడించింది.

సిద్దిపేట జిల్లాలో అత్యల్ప నమోదు

వరంగల్––ఖమ్మం––నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గంలో అత్యధికంగా నల్గొండ జిల్లాలో 46,038 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారు. సిద్దిపేట జిల్లాలో మాత్రం అత్యల్పంగా 3,672 దరఖాస్తులే అందాయి.

ఇతర జిల్లాల వారీగా నమోదైన వివరాలు

సూర్యాపేట: 31,512,యాదాద్రి భువనగిరి: 17,987,జనగామ: 13,503,మహబూబాబాద్: 19,634,వరంగల్: 23,179,హనుమకొండ: 21,226,జయశంకర్ భూపాలపల్లి: 5,407,భద్రాద్రి కొత్తగూడెం: 18,599,ఖమ్మం: 37,848,ములుగు: 5,744.

నవంబర్ 6 వరకు ఓటరు నమోదు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఎక్కువ మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటున్నారు. నవంబర్ 6 వరకు ఓటరునమోదుకుఫారం–18దరఖాస్తులనుస్వీకరించనున్నారు. నవంబర్ 25న రెండు నియోజకవర్గాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రచురించనున్నారు.నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. అనంతరం డిసెంబర్ 30న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించనుంది.

బీఎల్వోల వద్దే దరఖాస్తులు పెండింగ్

ఓటర్ల నమోదుకు దరఖాస్తులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతోపాటు, అందిన దరఖాస్తుల పరిశీలన కూడా నెమ్మదిగా సాగుతోంది. నాలుగు జిల్లాల్లో ఇప్పటివరకు పరిశీలన ప్రారంభం కాలేదు. అత్యధిక దరఖాస్తులు బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) వద్ద క్షేత్రస్థాయి పరిశీలన కోసం పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.అర్హులైన పట్టభద్రులంతా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా పోస్టు ద్వారా అర్హత ధ్రువీకరణ పత్రాలను జతచేసి ఫారం–18 సమర్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు.

కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు



- సీఎంతో పీసీసీ అధ్యక్షుడు కీలక భేటీ
- దీపావళి నాటికి భర్తీ

టీ మీడియా, అక్టోబర్ 22, హైదరాబాద్ బ్యూరో:

తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు త్వరలో తీపికబురు అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రభుత్వం, పార్టీ నాయకత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వీలైనంత త్వరగా నియామకాలు పూర్తి చేయాలనే యోచనలో ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నామినేటెడ్ పదవుల భర్తీ, ఎమ్మెల్సీ ఎన్నికలు, పీసీసీ కార్యవర్గం కూర్పు తదితర అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం.

నామినేటెడ్ పదవుల భర్తీపై కదలిక

చాలాకాలంగా పదవుల కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెస్ నాయకులకు అవకాశం కల్పించే దిశగా కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ ఛైర్మన్ పదవులతోపాటు పీసీసీ కార్యవర్గం ఏర్పాటు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై పార్టీ దృష్టి పెట్టింది. ఆర్టీసీ, పౌరసరఫరాల కార్పొరేషన్, మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులతోపాటు డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ వంటి కీలక పదవులను కూడా భర్తీ చేయాల్సి ఉంది. వీటిలో కొన్ని పదవులను ఎమ్మెల్యేలకు, అదే స్థాయి నాయకులకు కేటాయించాల్సి ఉండటంతో పార్టీ అధిష్ఠానంతో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.ఇప్పటికే చర్చలు పూర్తయి జాబితా సిద్ధంగా ఉన్న నామినేటెడ్ పదవులను వీలైనంత త్వరగా భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో భర్తీ చేసిన 37 కార్పొరేషన్ పదవుల కాలపరిమితి ముగియడంతో, వారిలో ఎంతమందికి తిరిగి అవకాశం కల్పిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఆరుగురు లేదా ఏడుగురికి మాత్రమే పునరావకాశం కల్పించి, మిగిలిన స్థానాల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వవచ్చని తెలుస్తోంది.సుమారు 50 మందితో జాబితా సిద్ధమైనట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కాలపరిమితి ముగిసిన కార్పొరేషన్లలో ఖాళీగా ఉన్న మరో 30 వరకు పదవులను కూడా ఈ జాబితాలో చేర్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదే జరిగితే దాదాపు 80 కార్పొరేషన్ ఛైర్మన్ పదవులను భర్తీ చేసే అవకాశముంది. అయితే ఈ సంఖ్యపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

సీఎంతో పీసీసీ అధ్యక్షుడి భేటీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కార్పొరేషన్ పదవుల భర్తీతోపాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి తీసుకుంటున్న చర్యలను సీఎంకు వివరించినట్లు తెలుస్తోంది. ఓటర్ల నమోదు ప్రక్రియలో పార్టీ తరపున అందిస్తున్న సహకారంపైనా చర్చించినట్లు సమాచారం.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న ఇద్దరు అభ్యర్థులూ రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే కావడంతో బీసీ సామాజికవర్గ నాయకులు, కార్యకర్తల్లో కొంత అసంతృప్తి ఉందన్న అంశాన్ని మహేశ్‌కుమార్ గౌడ్ సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. పార్టీ పరంగా చర్చించిన తర్వాతే అభ్యర్థుల ఎంపిక నిర్ణయం తీసుకున్నామని, ఎవరూ అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని సీఎం స్పష్టం చేసినట్లు సమాచారం.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలపైనా చర్చ

గవర్నర్ కోటాలో భర్తీ చేయాల్సిన మూడు ఎమ్మెల్సీ స్థానాల అంశం కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు అవకాశం దక్కని సామాజికవర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ఈ మూడు స్థానాల్లో ఒకటి పద్మశాలి సామాజికవర్గానికి కేటాయించనున్నట్లు సీఎం ఇప్పటికే ప్రకటించారు.మిగిలిన రెండు స్థానాల్లో మరో స్థానాన్ని కూడా బీసీ సామాజికవర్గానికి ఇవ్వాలనే ఆలోచన ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చివరి స్థానాన్ని మహిళకు కేటాయించాలా? లేక బ్రాహ్మణ సామాజికవర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలా? అన్న దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. తుది నిర్ణయం వెలువడిన తర్వాతే అభ్యర్థుల ఎంపికపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకాలపైనా

చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకాల అంశంపైనా రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్ చర్చించినట్లు సమాచారం. ఎలాంటి వివాదాలు లేని నాయకులకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులు కేటాయించే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాల్సిన అవసరాన్ని సీఎం గుర్తు చేసినట్లు తెలుస్తోంది.మొత్తంగా కార్పొరేషన్ పదవుల భర్తీ, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకాలపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఇరువురు నేతలు భావిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. దీపావళి నాటికి నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం, పార్టీ నాయకత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. దీంతో చాలాకాలంగా పదవుల కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెస్ నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.